ప్రజాశక్తి
మంగళవారం 23 జులై 2024 5 విజయనగరం

26న ఐటిఐలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-విజయనగరం కోట

కెఎల్‌గ్రూప్, ఎస్‌కె సేఫ్టీ వింగ్స్ ప్రయివేట్ లిమిటెడ్(అమెజాన్)లో పికింగ్, ప్యాకింగ్, స్కానింగ్, సోర్టింగ్, లోడింగ్, అన్‌లోడింగ్ విభాగాల్లో పనిచేయడానికి సుమారు 200 మందిని భర్తీ చేసేందుకు ఈ నెల 26న ప్రభుత్వ ఐటిఐలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి డి.అరుణ తెలిపారు. టెన్త్ పాసై ఉండాలని, స్త్రీపురుష అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. పుదువాయల్, పొన్నేరి, తిరువళ్లూర్ జిల్లా, చెన్నై రాష్ట్రంలో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. వేతనం సుమారు రూ.17వేల నుంచి రూ.19వేల మధ్య ఉంటుందని, ఇఎస్ఐ, పిఎఫ్, మెడికల్, ఓటి సదుపాయం ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఎంప్లాయిమెంట్. ఎపి.జిఓవి.ఇన్‌లో పేర్లను నమోదు చేసుకొని, 26వ తేదీన ఉదయం 10 గంటలకు జరిగే ఇంటర్వ్యూకు తన ఒరిజనల్ సర్టిఫికెట్లు, ఫోటో, జీరాక్స్ కాపీలతో హాజరు కావాలని కోరారు. ఇతర వివరాలకు 8919179415ను సంప్రదించాలని సూచించారు.

కేంద్రం కరుణించేనా?



కేంద్రంలో మూడోసారి అధికారం లోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టనున్న సంవత్సరాంతపు బడ్జెట్ సమావేశంలో జిల్లాపై కరుణ చూపనుందా? లేక ఎప్పటి మాదిరిగానే నిరాశ పర్చనుందా? అనే చర్చ ఉమ్మడి విజయనగరం జిల్లాలో సాగుతోంది. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్ట నున్నారు. దీంతో, జిల్లాకు ఎలాంటి మేలు చేస్తారన్న దానిపై ఆద్యంతం ఆసక్తికర చర్చ నడుస్తోంది. పన్నుల మినహాయింపులపై మధ్య తరగతి, విభజన హామీలు అమలుపై జిల్లా ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారు.

- గిరిజన వర్శిటీకి నిధుల కొరత
- అద్దె కొంపలో తరగతుల నిర్వహణ
- అక్కరకు చేరని ప్రత్యేక నిధులు
- తగ్గిన రైలు సదుపాయాలు
- నత్తనడకన ఆధునీకరణ పనులు
- అవస్థలు పడుతున్న ప్రజానీకం
- నేడు కేంద్ర బడ్జెట్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్ర విభజనలో భాగంగా 2014లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వడంతోపాటు వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక నిధులు విడుదల చేస్తామని చెప్పిన సంగతి తెలిసిందే. తొమ్మిది కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు కూడా విభజన చట్టంలో పేర్కొంది. ఇందులో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని విజయనగరం జిల్లాలో ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. ఆ సందర్భంలో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఎపికి ఐదేళ్లు కాదు, పదేళ్ల పాటు ప్రత్యేక హోదా ఇవ్వాల్సిన అవసరం ఉందంటూ బిజెపి నేతలు చిలకపలుకులు పలికారు. విభజన చట్టంలోవున్న హామీలన్నీ అమలు చేస్తామని కూడా నమ్మబలికారు. ఇదే నమ్మకంతో అప్పటి టిడిపి ప్రభుత్వం కూడా కేంద్రానికి మద్దతునిచ్చింది. తీరా హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయకపోవడంతో రాష్ట్ర ప్రజానీకం పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టారు. చివరికి టిడిపి కూడా కేంద్రప్రభుత్వంలోని భాగస్వామ్యం నుంచి తప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అందులో భాగంగానే నాడు కేంద్ర పౌరవిమాన యాన శాఖ మంత్రి పదవికి పూసపాటి అశోక్ గజపతిరాజు రాజీనామా చేశారు. అయినప్పటికీ 2019 ఎన్నికల్లో టిడిపిని రాష్ట్రంలో జనం చిత్తుగా ఓడించారు. ఐదేళ్ల పాటు అధికారానికి దూరంగావున్న టిడిపి, దానితో జతకట్టిన జనసేన కూడా తిరిగి బిజెపితో కూటమి కట్టారు. బిజెపితోనే అభివృద్ధి అంటూ నమ్మబలికారు. గడిచిన ఐదేళ్లలో అధికారంలోవున్న వైసిపి కేంద్రం మెడలు వంచలేకపోయిందన్న కోపంతో ఓడించారు. అదే టిడిపి, జనసేన గెలుపునకు కీలకమైంది. ఇచ్చిన మాట ప్రకారం టిడిపి, జనసేన పార్లమెంటులో కనీసం విభజన చట్టం, రైల్వే సదుపాయాలు, కేంద్రం పరిధిలోవున్న ఇతర సమస్యలు, అభివృద్ధికోసం మాట్లాడుతారా? లేదా? వీటి స్పందన ఎలా ఉంటుంది? అన్నదానిపై చర్చనడుస్తోంది.

ముఖ్యంగా గిరిజన వర్సిటీ ఏర్పాటు పట్ల కేంద్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. రెండోసారి అధికారం కోసం 2019 ఎన్నికలకు ముందు వర్సిటీ ఏర్పాటుకు అనుమతులు ఇచ్చింది. ఏరుదాటాక తెప్పను తగలబెట్టిన చందంగా రెండోసారి అధికారంలోకి రాగానే తిరిగి విస్మరించింది. మూడోసారి అధికారం కోసం ఇటీవల జరిగిన ఎన్నికలకు ముందు 2023 ఆగస్టు 25న కేంద్ర కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ జిల్లాకు వచ్చి వర్సిటీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నిర్మాణ పనులకు రూ.834కోట్లు కేటాయించినట్టు ప్రకటించారు. కానీ, ఇప్పటికీ నిధులు కేటాయించక పోవడంతో పనులు ఒక్క అడుగు కూడా వేయలేదు. దీంతో, తరగతులు, ప్రయోగాలు ప్రవేటు పంచల్లో నిర్వహిస్తున్నారు. కనీసం హాస్టల్ సదుపాయం కూడా కల్పించకపోవడంతో విద్యార్థులు పడుతున్న అవస్థలు అన్నీ,ఇన్నీ కావు. విభజన చట్టం ప్రకారం ఆరేళ్లపాటు ఏటా రూ.50కోట్ల చొప్పున జిల్లాకు కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సివున్నప్పటికీ అమలు చేయలేదు. జిల్లాకు కేవలం 64కోట్లు ఇచ్చి తేతులు దులిపేసుకుంది. ఒకానొక దశలో ఇచ్చిన నిధులను కూడా వెనక్కు తీసుకున్న సందర్భం ఉంది. ఇక జిల్లాలో రైల్వే సదుపాయాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. విజయనగరం జంక్షన్‌లోనూ చాలా సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు ఆగడం లేదు. రైల్వేస్టేషన్ల ఆధునీకరణ పనులు ముందుకు సాగడం లేదు. కొత్తగా ప్రతిపాదించిన రైలు మార్గాల ఊసేలేదు. రోజూ గంటన్నర వ్యవధిలో నడిచే వ్యవధిలో నడిచే విశాఖపట్నం - రాయ్‌పూర్, విశాఖపట్నం - కొరాపుట్ రైళ్లను ఒకే సమయంలో నడపడంతో ఉద్యోగులు, వ్యాపారులు, ఇతర ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. దేశంలో ఎక్కడా రైల్వే క్రాసింగ్‌లు లేకుండా చేస్తామన్న రైల్వేశాఖా మంత్రి చెప్పిన మాటలు మచ్చుకైనా అమలు కాలేదు. విశాఖ కేంద్రంగా ఏర్పాటు చేయాల్సిన రైల్లే జోన్ ఊసెత్తకపోవడంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూడా ఎండమావిగానే మిగిలిపోయాయి. ఈనేపథ్యంలో నేడు ప్రకటించనున్న కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు ఏమేరకు ప్రయోజనం చేకూరుతుందో వేచి చూడాల్సిందే.

గజపతినగరం స్టేషన్‌లో పాడైన వాహనాలను పరిశీలిస్తున్న ఎస్‌పి

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు

- అదృశ్యం కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి
- గంజాయి నియంత్రణకు వాహన తనిఖీలు : ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-గజపతినగరం, బొండపల్లి

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్‌పి వకుల్‌జిందాల్ సూచించారు. అదృశ్యం కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. గంజాయి నియంత్రణకు ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహించాలన్నారు. సోమవారం బొండపల్లి, గజపతినగరం, పెద మానాపురం, బూర్జువలస పోలీసు స్టేషన్లను తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ల ప్రాంగణాలు, పోలీసు క్వార్టర్స్ పరిసరాలను పరిశీలించారు. స్టేషను ప్రాంగణాల్లో గల వాహనాలు ఏ కేసుల్లో సీజ్ చేసినవి, ఎందుకు స్టేషను ప్రాంగణంలో ఉన్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్టేషను రిసెప్షన్ రికార్డులు పరిశీలించి, స్టేషనుకు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని ఆదేశించారు. అనంతరం, స్టేషను రికార్డులు, సిడి ఫైల్స్ తనిఖీ చేసి, గ్రేవ్ కేసుల్లో దర్యాప్తును పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రకు కు చర్యలు చేపట్టాలని, ఆకస్మికంగా వాహన తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణా నియంత్రకు చర్యలు చేపట్టాలని, పట్టుబడిన నిందితులనే కాకుండా అక్రమ రవాణకు కారకులైన ప్రధాన వ్యక్తులను గుర్తించి, అరెస్టు చేయాలన్నారు. సైబరు నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సైబరు మోసగాళ్ళు పంపే లింకులను క్లిక్ చేయవద్దని అన్నారు. సైబరు మోసానికి గురైతే 1930కు కాల్ చేయాలన్నారు. ఇలా చేయడం వలన వారి అకౌంట్స్ లో ఫ్రీజ్ అయిన నగదు, తిరిగి బాధితులకు వచ్చే అవకాశం ఉందన్నారు. అదృశ్యం కేసుల్లో నిర్లక్ష్యం వద్దని, వారి ఆచూకీ త్వరితగతిన కనిపెట్టేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. యువతులు, మహిళలు మోసపోకుండా చైతన్యం కల్పించేందుకు వారి తల్లిదండ్రులు చొరవ చూపి, అవగాహన కల్పించాలన్నారు. ఎస్‌పి వెంట బొబ్బిలి డిఎస్‌పి పి.శ్రీనివాసరావు, గజపతినగరం ఎ సిఐ ఎన్.వి.ప్రభాకర్, స్పెషల్ బ్రాంచ్ సిఐ కెకెవి విజయనాథ్, బొండపల్లి, గజపతినగరం, బూర్జివలస ఎస్‌ఐలు లక్ష్మణరావు , యు.మహేష్, లక్ష్మి ప్రసన్న కుమార్ తదితరులు ఉన్నారు.

బాధితుల సమస్యలకు తక్షణ పరిష్కారం : ఎస్‌పి

విజయనగరం కోట : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్‌పి వకుల్ జిందాల్ వినతులు స్వీకరించారు. ఈ వారం 29 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడి, చట్ట పరిధిలో చర్యలు చేపట్టి వారం రోజుల్లో సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిటిసి డిఎస్‌పి ఎం. వీరకుమార్, విజయనగరం డిఎస్‌పి ఆర్.గోవిందరావు, డిసిఆర్ సిఐ జె. మురళి, ఎస్‌బి సిఐలు కెకెవి విజయనాథ్, ఇ.నర్సింహ మూర్తి, డిసిఆర్‌బి ఎస్‌ఐ మురళి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలను అభినందిస్తున్న ఐఎంఎ అధ్యక్షులు జయచంద్రనాయుడు

శ్రీశ్రీ కోచింగ్‌సెంటర్ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని శ్రీశ్రీ కోచింగ్ సెంటర్ అధినేత పొట్టా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గాయత్రి హాస్పిటల్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో సోమవారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 48 మంది రక్తదానం చేశారు. ముఖ్యఅతిథిగా ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.జయచంద్ర నాయుడు, గాయత్రి హాస్పిటల్ ఎమ్‌డి డాక్టర్ జిబి వెంకట్ పాల్గొని రక్తదాతలను అభినందించారు, రక్తదాన శిబిరాల నిర్వహిస్తున్న పొట్ట శ్రీనివాసరావును అభినందించారు. ఈ సందర్భంగా జయచంద్ర నాయుడు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానమని అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రాణదానం చేసి మరొకరి ప్రాణాలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ ప్రతినిధి ఎం.రాము, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఇపిని రద్దు చేయాలి

యుటిఎఫ్ నిరసనలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్, బొబ్బిలి రూరల్

ఎన్ఇపి 2020, ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే జీవో 117ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యాన సోమవారం విజయనగరం, బొబ్బిలిలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. జిల్లా విద్యా శాఖ కార్యాలయం వద్ద నిరసను ఉద్దేశించి యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రమేష్ చంద్ర పట్నాయక్, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు మాట్లాడుతూ ఎన్ఇపి పేరుతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జీవో 117కారణంగా ప్రభుత్వ విద్యా సంస్థలు మూతపడ్డాయన్నారు.దీంతో ఎంతో మంది పేద విద్యార్థులు బడులకు దూరమవుతున్నారని అన్నారు. మరి కొంత మంది ప్రైవేటు పాఠశాలల్లో చేరుతున్నారని అన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలను అమలు చెయ్యాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు తిరుపతినాయుడు, సత్యన్నారాయణ, జి.నిర్మల, రాజారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిలో జరిగిన నిరసనను ఉద్దేశించి యుటిఎఫ్ నాయకులు కె.విజయగౌరి మాట్లాడారు. ఎన్ఇపి అమలుతో ప్రాథమిక విద్య ప్రమాదంలో పడిందని అన్నారు. వేల సంఖ్యలో పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలు గా మారిపోయాయని, ఉన్నత పాఠశాలల్లో సమాంతర మీడియాలు లేకుండా కేవలం ఇంగ్లీష్ మీడియం కే పరిమితం చేసి ఉపాధ్యాయుల సంఖ్య కుదించారని అన్నారు. జీవో 117తో కొన్నాళ్లకు ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

బొబ్బిలిలో నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు

పారిశుధ్యాన్ని మెరుగుపర్చండి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

మున్సిపాల్టీల్లో పారిశుధ్యాన్ని మెరుగు పర్చాలని, దోమల వ్యాప్తిని అరికట్టాలని కమిషనర్లను కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగస్టు 15న ప్రారంభించేందుకు జిల్లాలోని 3 అన్న క్యాంటీన్లను సిద్ధం చేయాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. విజయనగరం, బొబ్బిలి, రాజాం, నెల్లిమర్ల మున్సిపల్ కమిషనర్లతో తన ఛాంబర్‌లో సోమవారం సమావేశం నిర్వహించారు వారం రోజుల్లో కాలువల్లో పూడికలను తొలగించి, ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయించాలన్నారు. రాజాం, నెల్లిమర్ల అన్న క్యాంటీన్లతోపాటు, విజయనగరం ఘోషా ఆసుపత్రిలో ఏర్పాటు చేయనున్న అన్న క్యాంటీన్‌ను సెప్టెంబరు 21 నాటికి సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో డిఆర్ఒ ఎస్‌డి అనిత, కమిషనర్లు ఎంఎం నాయుడు, బాలాజీ ప్రసాద్, ఎల్.రామలక్ష్మి, జె.రామప్పల నాయుడు, డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు, పబ్లిక్ హెల్త్ ఇఇ దక్షిణామూర్తి, సహాయ మలేరియా అధికారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కార్డు లో మార్పుల కోసం అనధికార వ్యక్తులను ఆశ్రయించొద్దు

ఆధార్ కార్డులో సవరణలు వయస్సు మార్పుచేర్పులు చేస్తామంటూ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ బి ఆర్ అంబేద్కర్ హెచ్చరించారు. ఎలాంటి ఆధారాలు లేకపోయినా ఆధార్ లో మార్పులు, సవరణలు చేస్తామంటూ కొందరు ప్రచారం చేయడం తమ దృష్టికి వచ్చిందన్నారు. జిల్లాలో ప్రభుత్వం గుర్తించిన కేంద్రాలు మినహా మరెక్కడా ఆధార్ లో మార్పులు సవరణలు చేసేందుకు అవకాశం లేదని తెలిపారు.

వికలాంగులలకు ట్రై సైకిళ్లు పంపిణీ

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సౌజన్యంతో కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో 23 మూడు చక్రాల బ్యాటరీ సైకిళ్ళు, 6 చెవి మిషన్లు 6, 8 చేతి కర్రల ఉపకరణాలను జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమశాఖ ఎడి జగదీష్, ఐఒసిఎల్ జిఎం జివి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాచేస్తున్న గిరిజనులు

ఫారెస్ట్ అధికారుల నుంచి రక్షించండి

అటవీ శాఖ కార్యాలయం వద్ద గిరిజనుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఫారెస్ట్ అధికారుల నుంచి గిరిజనులను రక్షించాలని ఎపి ఆదివాసీ జెఎసి చైర్మన్ చిన్నబురిడి లక్ష్మణ, వైస్ చైర్మన్ తుమ్మి అప్పలరాజు దొర డిమాండ్ చేశారు. సోమవారం ఆదివాసీ జెఎసి ఆధ్వర్యంలో జిల్లా అటవీ శాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనులు పోడు వ్యవసాయం చేస్తున్న భూములలో ఫారెస్ట్ అధికారులు అడ్డుకుంటున్నారని, కేసులు పెడుతూ వేధిస్తున్నారని అన్నారు. కొన్ని గ్రామాలకు కరెంట్ మౌలిక సదుపాయాలు లేవని, విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ స్తంభాలు వేస్తే ఫారెస్ట్ అధికారులు ఆ స్తంభాలను తొలగిస్తున్నారని తెలిపారు. గిరిజనులు అడవిపై జీవించే హక్కును కాలరాస్తున్నారని దుయ్యబట్టారు. బొబ్బిలి, గజపతినగరం, శృంగవరపుకోట నియోజకవర్గాల్లో గిరిజనులు అటవీశాఖ అధికారుల నుంచి వేధింపులకు గురవుతున్నారని అన్నారు. అడవులను రక్షించే గిరిజనులపై కేసులపెట్టి అభివృద్ధికి దూరం చేస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో పలువురుగిరిజనులు పాల్గొన్నారు.

గడువులోగా వినతులు పరిష్కారం

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ గ్రీవెన్సులో 149 అర్జీలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

అధికారులు ఏ రోజు వినతులను ఆ రోజే చూడాలని, నాట్ ప్యూ ఉండకూడదని,కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వ్యవస్థకు వివిధ సమస్యలపై ప్రజల నుంచి వినతులను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు రీ ఓపెన్ అయిన వాటిని కూడా నిర్దేశిత గడువు లోగా పంపాలని, ఆన్లైన్ లో ఏ స్టేజి లో కూడా పెండింగ్ కనపడకూడదని అన్నారు. సోమవారం వివిధ సమస్యలపై ప్రజల నుంచి 149 వినతులు అందాయి. కలెక్టర్‌తోపాటు సంయుక్త కలెక్టర్ కార్తీక్, డిఆర్ఒ ఎస్‌డి అనిత వినతులు స్వీకరించారు.

- నగరంలో అనుమతులు లేని వాటర్ ప్లాంట్లను సీజ్ చేయాలని విజయనగరం ప్యాకేజీ డ్రింకింగ్ వాటర్ మ్యానుఫ్యాక్చర్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిశ బాలకృష్ణ వినతినిచ్చారు.
- మా తుపాకులు మాకు ఇప్పించండి అంటూ ఎరుకుల కులస్తులు కలెక్టర్‌కు వినతినిచ్చారు. 2019లో తుపాకుల రెన్యువల్ కోసం ఆర్‌డిఒ కార్యాలయానికి అప్పగించామని, జీవనోపాధి దెబ్బతిన్నందున మా తుపాకులు ఇప్పించాలని 8 మండలాలకు చెందిన 33మంది వినతులు ఇచ్చారు.
- జనవాసాల మధ్య సెల్ టవర్లు పెట్టవద్దని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గల 43వ వార్డు కాలనీవాసులుకలెక్టర్‌కు వినతినిచ్చారు.

కలెక్టర్‌కు వినతినిస్తున్న టిడిపి నాయకులు

ప్రభుత్వ భూమిని సంరక్షించండి

కొండకరకాం పంచాయతీ వేణుగోపాలపురం బిట్ -1 లో సర్వే నెంబరు 2 లో గల ప్రభుత్వం భూమిలో 40 మందికి అనధికారికంగా ఇంటి పట్టాలు ఇచ్చారని, ఈ విషయమై విచారణ జరిపించి ప్రభుత్వ భూమిని సంరక్షించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు టిడిపి నాయకులు వినతినిచ్చారు. టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, ఎంపిటిసి వేచలపు శ్రీనివాసరావు, మాజీ ఎంపిటిసి రాంబార్కి రాంబాబు , మాజీ సర్పంచ్ పాండ్రంకి గౌరి నాయుడు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న స్టాఫ్ నర్సులు

డిఎంఇలో ఉద్యోగాలు ఇప్పించండి

డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌లో ఉన్న ఉద్యోగాలను తమకు ఇప్పించాలని కోరుతూ నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న స్టాఫ్ నర్సుల కోరారు. ఈ మేరకు గ్రీవెన్సులో వినతి అందజేశారు. ప్రభుత్వం కోవిడ్ సమయంలో కొత్తగా రిక్రూట్ చేసిన వారికి కోవిడ్ వెయిటేజ్ మార్కులు కలిపినందున రాష్ట్ర ప్రభుత్వం తీసిన ఉద్యోగాలలో వారికి అవకాశం వచ్చిందని తెలిపారు. గత కొన్నాళ్లుగా ప్రభుత్వ మహారాజా ఘోషా ఆస్పత్రుల్లో పనిచేస్తున్న తమకు కూడా రాష్ట్రప్రభుత్వం భర్తీ చేయనున్న పోస్టుల్లో తమకు అవకాశం కల్పించాలని కోరారు.

ఆర్ఐఒపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

విజయనగరంటౌన్ : కార్పొరేట్ కళాశాలలకు కొమ్ముకాస్తున్న ఆర్ఐఒపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు డి.రాము,సి హెచ్ వెంకటేష్ వినతి అందజేశారు.కార్పొరేట్ కళాశాలల్లో విద్యార్థుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తున్నా ఆర్ఐఒ చూసి చూడనట్టు ఉంటున్నారని ఆరోపించారు. చీపురుపల్లి ఎస్సీ హాస్టల్ వార్డెన్ కూడా సక్రమంగా విధులు నిర్వహించడం లేదని హాస్టల్ వార్డెన్ పై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు రవి పాల్గొన్నారు.

- కొత్తవలసలోని ఉమా జ్యూట్ మిల్లు అక్రమ లాకౌట్ ఎత్తివేయాలని ఎఐఎఫ్‌టియు ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ నాయకులు గణేష్ పాండా మాట్లాడుతూ మిల్లును ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా మూసివేయడంతో 400 కుటుంబాలు రోడ్డున పడ్డాయని అన్నారు.

వినతులు స్వీకరించిన కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వేదికకు 14 వినతులు వచ్చాయి. పలువురు తమ సమస్యలపై కమిషనర్ ఎంఎం నాయుడుకు వినతులు అందజేశారు. స్పందించిన కమిషనర్ మస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో మధుసూదన రావు, అమ్మాజీ రావు, ఇఇ కె.శ్రీనివాసరావు, మేనేజర్ ప్రసాదరావు, టిపిఆర్ఒ సింహాచలం, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ప్రతీ ఒక్కరూ ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి అన్నారు. వర్షాకాలం ప్రారంభం కావటంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. దుప్పాడ గ్రామంలో కాష్వీ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 300 మంది రోగులకు బిపి, సుగర్ టెస్ట్‌లు ఉచితంగా చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయుకులు బొబ్బాది చంద్రనాయుడు, వివిధ గ్రామాల నాయకులు, జన సైనికులు వీర మహిళలు పాల్గొన్నారు.

జాతీయ పతాకానికి వందనం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జాతీయ పతాకం ఆవిర్భావం నేపథ్యంలో గురజాడ పాఠశాల విద్యార్థులు జెండా వందనం చేశారు. జాతీయ పతాకానికి సంబంధించిన వివిధ అంశాలపై క్విజ్, వకృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి కరస్పాండెంట్ ఎం.స్వరూప విద్యార్థులతో మాట్లాడుతూ పింగళి వెంకయ్య రూపొందించిన జాతీయ త్రివర్ణ పతాకం 1947 జులై 22 న మన రాజ్యాంగ సభ ఆమోదం పొందిందని తెలిపారు. జాతీయ పతాక గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించడం జరిగినది. కార్యక్రమంలో హెచ్‌ఎం పూడి శేఖర్, ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

జెండా వందనం చేస్తున్న విద్యార్థులు

ఆస్పత్రులకు రోగుల తాకిడి

● కిటకిటలాడుతున్న సిహెచ్‌సిలు ● పలు చోట్ల వైద్యం అందక అవస్థలు ● ఒపికి ఆధార్‌కార్డు లింకుతో మరిన్ని కష్టాలు ● నెల్లిమర్లలో గదులు చాలక వరండాలోనే వైద్యం

వర్షాలు కురుస్తుండడంతో జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. గ్రామాల్లో ఇంటికొకరు చొప్పున జ్వరపీడితులున్నారంటే అతిశయోక్తి కాదు. ఇటీవల కురిసిన వర్షాలతో జ్వర బాధితులు రెట్టింపయ్యారు. దీంతో సిహెచ్‌సిలు, సిహెచ్‌ఎన్‌సిలు రోగులతో కిటకిట లాడుతున్నాయి. జ్వరంతో పాటు డయేరియా వంటి కేసులు కూడా ఆస్పత్రుల్లో నమోదవుతున్నాయి. ప్రతి సిహెచ్‌సిలో రోజుకు 200 నుంచి 300 వరకు ఒపి ఉంటుండగా వైద్య సిబ్బంది చెబుతున్నారు. అయితే కొన్ని చోట్ల ఆధార్ కార్డుకు ఫోన్ నెంబరు లింకు ఉంటే తప్ప ఒపి రాయక పోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. రాజాం ఏరియా ఆస్పత్రిలో రక్త నమూనాలకు రెండు రోజులు సమయం పట్టడం, నమూనాలు వచ్చినంత వరకూ వైద్యం అందకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. పైగా ఇక్కడ కొంత మంది వైద్యులు సమయం పాటించక పోవడంతో వారి కోసం రోగులు నిరీక్షించాల్సి వస్తుంది. నెల్లిమర్ల సిహెచ్‌సిలో రోగులకు గదులు చాలక వరండాలోనే వైద్యం అందిస్తున్నారు. వైద్యులకు కూడా గదులు లేక అందరూ ఒకేచోట కూర్చుని వైద్యం అందిస్తున్నారు. ఎస్‌కోట సిహెచ్‌సిలో పరికరాలు పని చేయకపోవడంతో కొన్ని టెస్టులకు ప్రయివేటు ఆస్పత్రులకు పంపించడంతో రోగులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.

ఒపిని పరిశీలిస్తున్న వైద్యులు, క్యూలో ఉన్న రోగులు

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక సిహెచ్‌సికు రోగులు తాకిడి పెరిగింది. విస్తారంగా వర్షాలు కురవడంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయి. జ్వర పీడితులు సంఖ్య పెరగడంతో ప్రభుత్వ ఆసుపత్రికి రోగులు తాకిడి పెరిగినట్లు వైద్యులు చెబుతున్నారు. సిహెచ్‌సిలో జనరల్ ఫిజిషియన్, ఆర్థోపెడిక్, కంటి, చెవి, ముక్కు, దంత వైద్యులు, గైనిక్ వైద్యులు అందుబాటులో ఉండడంతో ఆయా వ్యాధులతో బాధపడుతున్న రోగులు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం రోజుకు 300 నుంచి 350 మంది వరకు వస్తున్నారు. జ్వరాలు, రక్తహీనత, ఎముకలు, గ్యాస్ట్రిక్, కంటి, దంత, చెవి, ముక్కు సంబంధించిన వ్యాధులతో బాధపడుతున్న రోగులు ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందుతున్నారు. వైద్య పరీక్షలు కోసం గర్భిణులు రోజుకు 20మంది వరకు వస్తున్నారు. చికిత్స కోసం బొబ్బిలి పట్టణం, గ్రామీణ ప్రాంతాలు, బలిజిపేట, రామభద్రపురం, తెర్లాం, బాడంగి, మక్కువ, సీతానగరం ప్రాంతాల నుంచి కూడా రోగులు వస్తున్నారు. ఆరోగ్యశ్రీ వర్తించే వ్యాధులకు ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్యం అందిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామని సూపరింటెండెంట్ గేదెల శశిభూషణరావు చెప్పారు.

ఒపి కోసం క్యూలో నిలబడిన రోగులు

రోగులతో కిటకిటలాడుతున్న ఎస్‌కోట కమ్యూనిటీ ఆస్పత్రి

120 పంచాయతీలకు ఒక్కటే ఆస్పత్రి

రేగిడి: రాజాం పట్టణంలో రేగిడి, సంతకవిటి, వంగర, రాజాం మండలాలకు ఒకే ఒక వంద పడకల ఏరియా ఆసుపత్రి ఉంది. 120 గ్రామ పంచాయతీలకు ఈ ఏరియా ఆసుపత్రే దిక్కు. ఈ ఏరియా ఆసుపత్రిలో ప్రస్తుతం జ్వర పీడితులే ఎక్కువగా ఉన్నారు. ఒపి విషయానికొస్తే ఆధార కార్డు, ఆధార్ కార్డుకు ఫోన్ నెంబరు లింకు ఉంటేనే రోగులకు ఒపి రాస్తున్నారు. దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఆస్పత్రికి రోజువారీ ఒపి 200 వరకూ ఉంటుంది. కొంతమంది వైద్యులు ఆస్పత్రికి ఆలస్యంగా రావడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైద్యులు సమయాలు పాటించకపోవడంతో పాటు వైద్య తనిఖీలు, రక్త నమూనాలకు రెండు రోజులు పట్టడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కొన్ని సందర్భాల్లో వైద్యులు కోసం నిరీక్షించాల్సి వస్తుందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా వైద్య శాఖ అధికారులు స్పందించి పర్యవేక్షణ జరిపి రోగులకు న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.

ఆసుపత్రి నిర్మాణం పూర్తి కాక రోగుల ఇక్కట్లు

శృంగవరపుకోట : పట్టణంలోని ప్రస్తుతమున్న 50 పడకల ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా గత ప్రభుత్వంలో నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించినప్పటికీ నూతన భవన నిర్మాణ పనులు నత్త నడకన సాగడంతో ఆసుపత్రికి వచ్చిన రోగులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు పెరిగి ఆసుపత్రిలో ఒకే బెడ్‌పై ఇద్దరు రోగులను పడుకోబెడుతున్నారు. ఒపి ఆన్‌లైన్ విధానం ప్రవేశ పెట్టడంతో రోగులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి తోడు ఆసుపత్రిలో పరికరాలు సరిగ్గా పనిచేయకపోవడంతో ప్రతి చిన్న టెస్టులకు ప్రైవేటు ఆసుపత్రులను సంప్రదించాల్సి వస్తుంది. ఈ ప్రభుత్వంలోనైనా స్థానిక ఎమ్మెల్యే త్వరగా 100 పడకల ఆస్పత్రి నిర్మాణాన్ని పూర్తి చేయించి అన్ని సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావాలని రోగులు కోరుతున్నారు.

నెల్లిమర్లలో 290 ఒపి.. 32 ఐపి

నెల్లిమర్ల: స్థానిక సామాజిక ఆసుపత్రిలో ఔట్ పేషెంట్ 290 మంది, ఇన్ పేషంట్లో 32 మంది ఉన్నారు. ఇటీవల కురిసిన వర్షాలు కారణంగా జ్వరపీడితుల సంఖ్య గణనీయంగా పెరిగింది. డై యేరియా, జ్వర బాధితులు అధికంగా ఉన్నారు. వీరితో పాటుగా షుగర్, బిపి పేషంట్లు కూడా చికిత్స కోసం వస్తున్నారు. సతివాడ, కొండవెలగాడ, గుర్ల పిహెచ్‌సిల నుంచి రిఫరల్ కేసులు కూడా ఇక్కడ అధికంగా వస్తున్నాయి. రోగులకు బెడ్లు చాలక పోవడంతో ఆసుపత్రి ఆవరణలో చికిత్స పొందుతున్నారు. వైద్యులకు సరిపడినంత గదులు లేకపోవడంతో ఒకే చోట అందరూ మూకుమ్మడిగా కూర్చొని వైద్య సేవలు అందిస్తున్నారు.

వరండాలో చికిత్స పొందుతున్న రోగులు

ఘనంగా కృష్ణమాచార్య జయంతి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రముఖ కవి దాశరథి కృష్ణమాచార్య జయంతిని తెలుగు శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా దాశరథి చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు పుష్పాలతో అంజలి ఘటించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్.కేశవరావు మాట్లాడుతూ దాశరథి చైతన్యం ఉన్న ప్రజాకవి అని అగ్నిధార తిమిరంతో సమరం వంటి రచనలతో నిజాం వ్యతిరేకంగా తెలంగాణలో ప్రజలను చైతన్యపరిచారని, 'ఆ చల్లని సముద్ర గర్భం దాచిన బడ బానలమెంతో' అనే గేయాన్ని చదివి వినిపించారు. తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ రేవల్ల శ్రీలక్ష్మి మాట్లాడుతూ దాశరథి తెలుగు సాహితీ లోకం మెచ్చిన మహాకవి అని, నిజాం పాలనలో రకరకాల హింసలననుభవిస్తున్న తెలంగాణాను చూసి చలించిపోయారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ వి.సుధీర్, ఎన్ఎస్ఎస్ పి.ఒ పి.భాస్కర్, ఎన్ఎస్ కోఆర్డినేటర్ షేక్ పరీఖాన్, కమర్శ అధ్యాపకులు హేమ, విద్యార్థులు పాల్గొన్నారు.

బీమా పరిష్కారాల వేగవంతానికి కృషి

ప్రజాశక్తి- రామభద్రపురం

చెక్కును అందిస్తున్న మేనేజర్ హరీంద్ర

భారతీయ స్టేట్ బ్యాంకులో నమోదు చేసుకున్న ఖాతాదారుల బీమా పరిష్కారాల వేగవంతానికి కృషి చేస్తున్నామని స్థానిక బ్రాంచ్ మేనేజర్ హరీంద్ర తెలిపారు. సోమవారం బ్రాంచ్ ఆవరణలో ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన చొక్కాపు మురళీ వారసులు జయమ్మకు రూ.2లక్షల భీమా క్లెయిమ్ చెక్ అందజేశారు. ఈ సందర్భంగా హరీంద్ర మాట్లాడుతూ మృతుడు మురళీ తమ బ్యాంకు ఖాతాదారునిగా ఉంటూ ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా పాలసీలో కేవలం రూ.436 చెల్లించి చేరారన్నారు. అప్పుడు ఆ కుటుంబానికి అండగా ఈ పాలసీ నిలిచిందన్నారు. ప్రతీ ఖాతాదారుడు తప్పనిసరిగా జీవన జ్యోతి, సురక్ష భీమా యోజనా పథకాల్లో చేరాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ కిరణ్ కుమార్, క్యాష్ ఇన్‌చార్జి హరికృష్ణ, సర్వీస్ మేనేజర్ రమేష్, సిబ్బంది లక్ష్మణరావు, శ్రావణి, ధర్మారావు, బీసి పాయింట్ ప్రతినిధి పిల్ల సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురం గ్రామంలో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని ఇంచార్జ్ ఇఒ మెంగం సురేష్ తెలిపారు. నాతవలస వద్దనున్న చంపావతి నదిలోని బోరు వద్ద మూడు రోజులు క్రితం వర్షాలకు విద్యుత్ సరఫరాలో ఏర్పడిన అంతరాయం వల్ల మోటారు మరమ్మతులకు గురైందని తెలిపారు. అందుకు మళ్లీ గురువారం నుంచి తాగునీటిని సరఫరా చేస్తామన్నారు. దీనికి గ్రామస్తులు సహకరించాలని ఆయన కోరారు.

మరుగుదొడ్ల బిల్లులు చెల్లించండి

ప్రజాశక్తి - వంగర

మండలంలోని మగ్గూరు పాఠశాలలో ఎన్నికల ముందు నిర్మించిన మరుగుదొడ్లకు బిల్లులు చెల్లించాలని ఆ గ్రామ సర్పంచ్ పోలు రెడ్డి రమేష్ అన్నారు. ఈ మేరకు తహశీల్దార్ చిరంజీవి పడాల్‌కు తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాపరిష్కార వేదికలో వినతి పత్రం అందజేశారు. బిల్లులు అందకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని వివరించారు.

బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి- శృంగవరపుకోట

లాస్యను అభినందిస్తున్న వరలక్ష్మి

మండలంలోని భవాని నగర్ వద్ద గల డాక్టర్ వరలక్ష్మి పబ్లిక్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న లాస్య రాష్ట్ర స్థాయి అండర్ -17 బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైంది. ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన అండర్ -15 డబుల్ బాడ్మింటన్‌లో విన్నర్ గాను, అండర్ -17 బాడ్మింటన్ సింగల్స్‌లో రన్నర్‌గాను విజయం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు లాస్యను డాక్టర్ వరలక్ష్మి పబ్లిక్ స్కూల్ యాజమాన్యం డాక్టర్ వరలక్ష్మి, కిలపర్తి రాజేంద్ర ప్రసాద్, పాఠశాల ప్రిన్సిపాల్ వై. జానకి దేవి, వ్యాయామ ఉపాధ్యాయుడు గొర్లె రాము అభినందించారు.

మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన అల్లాడ కాత్యాయని ఉమెన్ డబుల్స్ పోటీలలో పి. మౌనికతో కలిసి ద్వితీయ స్థానం సాధించింద పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ పొట్నూరు శ్రీరాములు, లోకి రెడ్డి కృష్ణ తెలిపారు. గెలుపొందిన కాత్యాయినికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు బంగారు ఉమామహేశ్వరరావు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ శ్రీరాములు మాట్లాడుతూ కాత్యాయని ఆగస్టు నెలలో జరగబోవు రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో విజయనగరం జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందని అన్నారు.

ఘనంగా పై దినోత్సవం

ప్రజాశక్తి - వంగర

పై ఆకారంలో విద్యార్థుల ప్రదర్శన

మండలంలోని యుకె గుమ్మడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పై దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయులు సోమేశ్వర రావు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత ఉపాధ్యాయులు వాసు దేవరావు, మోహనరావులు పై దినోత్సవ ప్రాముఖ్యతను వివరిస్తూ పై అంటే వృత్త చుట్టుకొలతకి దాని వ్యాసానికి మధ్య నిష్పత్తి అని, దీనిని విలియం జోన్స్ కనుగొన్నారని తెలియజేశారు. అనంతరం పై అనే గ్రీకు అక్షరం ఆకారంలో విద్యార్థులను కూర్చోబెట్టి అలరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వై.గోవిందరావు విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ కొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- భోగాపురం

భోగాపురం సమీపంలోని పెద్ద కానాల వద్ద సోమవారం రాత్రి జాతీయ రహదారి పై గుర్తు తెలియని వాహనం గుర్తు తెలియని వ్యక్తిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని ఆ రహదారిపై ప్రయాణిస్తున్న కొంత మంది ప్రయాణికులు నాతవలస టోల్ గేట్ వద్ద హైవే సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు అంబులెన్స్ పంపించారు. అయితే అప్పటికే ఆ వ్యక్తి మృతి చెందడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలని వినతి

ప్రజాశక్తి - వేపాడ

రోడ్డు సమస్యను వివరిస్తున్న అప్పారావు

మండలంలోని సోంపురం జంక్షన్ నుండి వేపాడ మీదుగా ఆనందపురం వరకు సుమారు 16 కిలోమీటర్లు రోడ్డు పూర్తిగా గుంతలమయమైందని రోడ్డును బాగుచేయాలని సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు ఎంపిడిఒను కోరారు. ఈ మేరకు సోమవారం మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో ఆమెకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ఆ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా గత ప్రభుత్వం రూ.39 కోట్లు మంజూరు చేసిందని, పూర్తిస్థాయిలో విస్తరణ పనులు జరగకపోవడంతో సోంపురం నుండి వేపాడ మండల కేంద్రం వరకు రోడ్డుకు భారీగా గొంతులు పడ్డాయని చెప్పారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఆమె దృష్టికి తీసుకొచ్చారు. తాత్కాలింగా పూడ్చేందుకు పంచాయతీ నిధులను వెచ్చించాలంటే ఎంపిడిఒ ఆదేశాలివ్వాలని సర్పంచులు చెబుతున్నారని అన్నారు. మీరు ప్రత్యేక చొరవ చూపి గ్రామ సర్పంచులు చేపట్టిన పనులకు పంచాయతీ నిధుల నుండి బిల్లు పెట్టుకునే అవకాశం కల్పించి మండల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.

బాలికలపై లైంగిక దాడులు అమానుషం

ప్రజాశక్తి -గజపతినగరం, నెల్లిమర్ల

రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు, బాలికలపై జరుగుతున్న దాడులు అమానుషమని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కె. జగదీష్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు, బాలికలపై జరుగుతున్న లైంగిక వేధింపులకు నిరసనగా సోమవారం గజపతినగరం నాలుగురోడ్ల జంక్షన్, నెల్లిమర్లలోని రామతీర్థం జంక్షన్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కె. జగదీశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు కనీసం రక్షణ లేదన్నారు. ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో రాష్ట్రంలో మహిళలపై దాడులు మరింత పెరిగాయని ఇది ఆందోళనకరమైన విషయమని అన్నారు. ఈ దాడులకు కారణం మహిళలు వేసుకునే బట్టలు అని చెప్తున్న ఈ సమాజం మరి రామభద్రపురంలో ఆరు నెలల పసికందు ఏ విధమైన బట్టలు వేసుకుందని, ఏ విధంగా లైంగిక దాడికి ప్రోత్సహించిందని ప్రశ్నించారు. దాడులకు విరివిగా లభ్యమవుతున్న గంజాయి, డ్రగ్స్ కారణమని వాటిని వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. నంద్యాల జిల్లాలో 9 ఏళ్ల అమ్మాయిని రేప్ చేసి చంపేసిన బాలురు చూసిన సైట్లను వెంటనే తొలగించాలన్నారు. తక్షణమే హత్యాచారానికి గురైన బాధితులను ప్రభుత్వం ఆదుకొని, ఈ అత్యాచారాలకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని కాగితాలకే పరిమితమైన దిశా, నిర్భయ, పోక్సో చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ సమీరా మాట్లాడుతూ కాగితాలలో బందీ అయిన దిశ నిర్భయ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జిల్లా కమిటీ సభ్యులు వంశి, నాయకులు దుర్గా ప్రసాద్, మురళి విద్యార్థులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

నిధులు విడుదల చేయండి

సిఎం చంద్రబాబుకు బేబినాయన వినతి

ప్రజాశక్తి- బొబ్బిలి



సిఎంకు వినతినిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

పారాది వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఎమ్మెల్యే బేబినాయన సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా వినతిపత్రం అందజేశారు. రెండు జిల్లాలను అనుసంధానం చేసే వంతెన కుంగడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పారాది వంతెన నిర్మాణాన్ని గత వైసిపి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. వంతెన నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని కోరారు. బొబ్బిలి-తెర్లాం, పినపెంకి-ఆకులకట్ట రోడ్డు బాగు చేసేందుకు నిధులు విడుదల చేయాలని కోరారు. నిధులు విడుదలకు చంద్రబాబు హామీ ఇచ్చినట్లు బేబినాయన తెలిపారు.

అభ్యసన సామాగ్రితోనే మెరుగైన బోధన

ప్రజాశక్తి- భోగాపురం

భోదన అభ్యసన సామాగ్రి (టిఎల్ఎం) ద్వారా విద్యార్థులు పాఠాలను చక్కగా అర్థం చేసుకుంటారని ముక్కాం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి నర్సింగరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానం -2020 నాలుగో వార్షికోత్సవం సందర్భంగా జూలై 22 నుండి 28వ తేదీ వరకు శిక్ష సప్తాహ అనే కార్యక్రమం వారం రోజులు పాటు ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం మొదటి రోజు పాఠ్య పుస్తకాలు, ప్రత్యేకమైన అభ్యసనా ఫలితాలకు అనుగుణంగా టిఎల్ఎంలను ఉపాధ్యాయులు విద్యార్థులు సహకారంతో తయారు చేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్. భవాని, ఎస్ నళిని, కే.లక్ష్మణ రావు, ఇ అనసూర్య, వై. మల్లికార్జునరావు, జి గణపతి, కృష్ణ, లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

రామభద్రపురం: విద్యా బోధనలో బోదనోపకరణాలు ముఖ్య భూమిక పోషిస్తాయని ఎంఇఒ-2 పెంటయ్య అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 'శిక్షా సప్తాహ్' కార్యక్రమంలో భాగంగా స్వల్ప తయారీ ఖర్చుతో కూడిన బోధనోపకరణాల ప్రదర్శన సోమవారం నిర్వహించారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు దాలినాయుడు విద్యార్థులకు యుక్తమైన చార్టులను ఎంపిక చేసి తక్కువ ఖర్చుతో అట్టలపై అనేక రకాల చిత్రాలను అమర్చి, పిల్లల చేత తయారు చేయించి ఆరవ తరగతి విద్యార్థులతో ప్రదర్శనకు ఏర్పాట్లు చేశారు. ఈ ప్రదర్శనను తిలకించిన ఎంఇఒ పెంటయ్య, ప్రధానోపాధ్యాయులు కామేశ్వరరావులు అభినందిస్తూ, తక్కువ ఖర్చుతో బలమైన బోధనోపకరణలు తయారు చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలన్నారు. ఉపాధ్యాయ కార్యదర్శి మురళీధర్‌రావు మాట్లాడుతూ ఆరో తరగతి విద్యార్థుల కోసం సాంఘిక శాస్త్ర పాఠాలను బోధించడానికి తక్కువ ఖర్చుతో కూడిన బోధనోపకరణాలను ఉపయుక్తంగా తయారు చేసి ఉపాధ్యాయులకు స్ఫూర్తి నిచ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ శ్రీదేవి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గజపతినగరం: జిన్నాం హైస్కూల్లో సోమవారం 'శిక్షా సప్తాహ్' కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు సిద్ధాంత త్రినాధ రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రదర్శించిన టిఎల్ఎంలను సందర్శించి వారిని అభినందించారు.

వేపాడ: మండలంలోని దబ్బిరాజుపేట ప్రాథమిక పాఠశాల, బక్కు నాయుడుపేట బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల వసతగృహంలోనూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన శిక్షా సప్త హ్ కార్యక్రమం మొదటి రోజు ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో వసతి గృహం ఇంఛార్జి ప్రిన్సిపాల్ ఉషారాణి, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం: బోధన పరికరాలతో విద్యార్థులు

విత్తనాలను పరిశీలించిన డిపిఎం

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని కొత్త వెలగాడ, వసాధి గ్రామంలో వేసిన డ్రమ్ము సిడర్ విత్తనాలను సోమవారం అడిషనల్ డిపిఎం సోమ నాయుడు పరిశీలించారు. వసాది గ్రామానికి చెందిన తోకవరపు ఆదినారా యణమూర్తి వేసిన విత్తనాలను పరిశీలించి పలు సూచనలు చేశారు ఈ విధంగా విత్తనం వేయడం వల్ల విత్తనం మోతాదు, కూలీలు ఖర్చులు, కలుపు నివారణ తగ్గి అధిక దిగుబడులు పొందవచ్చునని అన్నారు. తక్కువ ఖర్చుతో అధిక లాభాను పొందే మార్గాన్ని వివరించారు. వరి పంట పండించే విధానం గురించి రైతులకు అవగాహన కల్పించారు. అందులో భాగంగా పిఎండిఎస్ నవధాన్యాలు ఫీల్డ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంఛార్జి ఎస్.ఎర్నిబాబు, ఫార్మర్ సైంటిస్ట్ గాయత్రి, ఐసిఆర్‌పిఎస్‌లు తదితరులు పాల్గొన్నారు.

కొత్త క్వారీలకు ఎలా అనుమతిచ్చారు?

అధికారులపై మండిపడ్డ రామచంద్రపేట గ్రామస్తులు

ప్రజాశక్తి- భోగాపురం

గ్రామానిక ఆనుకుని ఉన్న క్వారీలతో ఇబ్బంది పడుతుంటే మళ్ళీ కొత్త క్వారీకి ఎలా అనుమతులు మంజూరు చేస్తారని రామచంద్రపేట గ్రామస్తులు అధికారులపై మండిపడ్డారు. అంతేకాక క్వారీ వద్దంటు వ్యతిరేకించారు. ఈ క్వారీ పనులు చేపట్టవద్దని గత కొన్ని రోజులు నుంచి గ్రామస్తులు పనులను అడ్డుకుంటున్న విషయం తెలిసిందే. రామచంద్రపేట గ్రామం వద్ద కొత్తగా జిఎంఆర్ సంస్థ విమానాశ్రయ నిర్మాణ పనుల కోసం క్వారీకి అనుమతులను పొందింది. ఈ పనులు ప్రారంభిస్తుండగా ఇటీవలి కాలంలో గ్రామస్తులు రెండు మూడుసార్లు అడ్డుకున్నారు. ఇంతలో ఎన్నికలు రావడం ప్రభుత్వం మారడంతో పనులు చేసేందుకు జిఎంఆర్ సంస్థ వెళ్ళలేదు. మరోపక్క గ్రామస్తుల ఫిర్యాదుతో ఎమ్మెల్యే లోకం మాధవి కూడా గ్రామంలో పర్యటించారు. ఈ నేపథ్యంలో ఆర్‌డిఒ సూర్యకళ, జిఎంఆర్ సంస్థ ప్రతినిధి రామరాజు, ఎల్ అండ్ టి సంస్థతో పాటు గనుల శాఖ అధికారులు సోమవారం క్వారీ ప్రాంతాన్ని పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. క్వారీ వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు అధికారులకు తెలిపారు. బాంబుల పేలుళ్ళకు ఇళ్లల్లో ఉండలేని పరిస్థితని వివరించారు. కొన్ని ఇళ్ళకు సంబంధించి శ్లాబు పెచ్చులు రాలిపోతున్నాయని తెలిపారు. పేలుళ్ల సమయంలో విపరీతంగా దుమ్ము గాలిలో నుంచి గ్రామంలోకి వస్తుందని చెప్పారు. పేలుళ్ళు ఎలా నిర్వహిస్తున్నారని ఎల్ అండ్ టి సంస్థను ఆర్‌డిఒ అడగగా వారంతా తప్పుడు సమాచారం ఇవ్వడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకసారి వంద నుంచి 150 రంధ్రాలు పెట్టి పేలుళ్ళ నిర్వహిస్తామని చెప్పగా అదంతా అబద్ధమని గ్రామస్తులు అన్నారు. ఒక్కోసారి ఏకంగా వెయ్యి వరకు రంధ్రాలు పెట్టి పేలుళ్ళ నిర్వహిస్తున్నారని గ్రామస్తులు చెప్పారు. అనంతరం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలిని పిలిచి పేలుళ్ళ గురించి ఆర్‌డిఒ ఆరా తీశారు. పేలుళ్ల సమయంలో దుమ్ము, దూళి పెద్ద ఎత్తున వస్తుందని ఆమె వివరించారు. ఎట్టి పరిస్థితుల్లోని క్వారీ ఇక్కడ పెట్టవద్దని గ్రామస్తులు దుక్క అప్పన్న, కోలా రామసూరి, దుక్క రమణ, నర్సింహులు, క్రిష్ట, గోవింద్ తదితరులు అధికారులను కోరారు. దీంతో అధికారులు వెనుదిరిగారు. తహశీల్దారు శ్యామ్ ప్రసాద్, గనులశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యను ఆర్‌డిఒకు వివరిస్తున్న గ్రామస్తులు

ఫారమ్ నెం.INC-25 A

పబ్లిక్ కంపెనీని ప్రైవేట్ కంపెనీగా మార్చుట కొరకు వార్తా పత్రికలో ప్రచురించే ప్రకటన,
ప్రాంతీయ డైరెక్టర్,

కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆగ్నేయ ప్రాంతం వారి సమక్షంలో కంపెనీల చట్టం, 2013, కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 14 మరియు కంపెనీల (ఇన్ కార్పొరేషన్) రూల్స్, 2014లోని రూల్ 41 విషయంలో.

మరియు

మెసర్స్ సాయి పైడిమాంబ హోటల్స్ అండ్ రిసార్ట్స్ లిమిటెడ్ (CIN: U55101AP2002PLC039320) డోర్ నెం.7-1-44, మంచుకొండవారి వీధి, విజయనగరం-535 001 వద్ద రిజిస్టర్డ్ ఆఫీస్‌ని కలిగి ఉన్న దరఖాస్తుదారు విషయంలో సదరు రూల్స్‌తో చదువబడే కంపెనీల చట్టం 2013లోని సెక్షన్ 14 కింద **మెసర్స్ సాయి పైడిమాంబ హోటల్స్ అండ్ రిసార్ట్స్ లిమిటెడ్** (CIN: U55101AP2002PLC039320) డోర్ నెం.7-1-44, మంచుకొండవారి వీధి, విజయనగరం-535 001 వద్ద 18.07.2024 గురువారం ఉదయం 11గంటలకు నిర్వహించిన అసాధారణ సమావేశంలో ఆమోదించిన ప్రత్యేక తీర్మానం ప్రకారం ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా మార్చుకొనుటకు ఆశిస్తూ, అట్టి మార్పు కంపెనీకి సజావుగా జరిగేలా చేయాలని కేంద్ర ప్రభుత్వానికి ధరఖాస్తు చేసుకునేందుకు ఉద్దేశిస్తోందని ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి తెలియజేయడమైనది. డైరెక్టర్, ఆగ్నేయ ప్రాంతం, 3వ అంతస్తు, కార్పొరేట్ భవన్, బండ్లగూడ, నాగోల్, తట్టిఅన్నారం గ్రామం, హయత్ నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్-500068, తెలంగాణ వారికి కంపెనీ యొక్క ప్రతిపాదిత మార్పు/స్థితిని ప్రభావితం చేసేటటువంటి ప్రయోజనం కలిగిన ఎవరైనా, అతని ప్రయోజనం యొక్క స్వభావం మరియు వ్యతిరేకించుటకు గల కారణాలు తెలియజేస్తూ ఒక అఫిడవిట్ ద్వారా మద్దతునిచ్చే అతని అభ్యంతరములను రిజిస్టర్ పోస్టుద్వారా దిగువ తెలిపిన చిరునామా వద్ద గల దాని నమోదిత కార్యాలయంలో దరఖాస్తుదారు కంపెనీకి ఒక కాపీతో ఈ ప్రకటన ప్రచురణ తేది నుండి 14 రోజులు లోగా తెలియజేయగలరు. లేదా అందుకు కారణం తెలియజేయగలరు. లేదా పంపించగలరు.

నమోదిత కార్యాలయ చిరునామా : డోర్ నెంబర్.7-1-44,
మంచుకొండవారి వీధి, విజయనగరం-535 001
స్థలం: విజయనగరం
తేది : 19-07-2024

దరఖాస్తుదారు కోసం మరియు తరపున
(డి.నరసయ్యమ్మ)
డైరెక్టర్,
(డిన్ :02709373)